ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023



పిడుగుపడి 8 మేకలు మృతి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని మరిపల్లి పంచాయతీ వెలగవలస వద్ద శనివారం కురిసిన భారీ వర్షంతోపాటు పిడుగు పడడంతో 8 మేకలు మృతి చెందాయి. మరిపల్లికి చెందిన మీసాల సత్యం, కోండ్రు తిరుపతి తమ మేకలను మేపేందుకు వెలగవలస సమీపానికి తోలుకెళ్లారు. వర్షంతో పాటు ఈదురు గాలులు వీయడంతో భయపడి స్థానిక బంగరమ్మ గుడి వద్ద మేకలను నిలబెట్టారు. అంతలో పిడుగు పడడంతో 8 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి.



మృతి చెందిన గొర్రెలు

డొమినిక్ కథ అడ్డం తిరిగింది!

- బెయిల్‌తో బయటపడ్డ ట్రాన్స్‌కో ఎఇ
- ఎసిబికి తలనొప్పిగా కేసు

ప్రజాశక్తి-మక్కువ

అవినీతి నిరోధక శాఖ చేపట్టిన దాడుల్లో మక్కువ ట్రాన్స్ కో ఎఇ కేసు సంచలనంగా మారింది. ఎసిబి ట్రాప్ నుంచి తప్పించుకున్న దాఖలాలు ఇప్పటివరకు ఉమ్మడి విజయనగరం జిల్లా చరిత్రలో లేదు. కానీ మన్యం జిల్లా మక్కువ మండలంలో ఈనెల 27వ తేదీ రాత్రి జరిగిన ఎసిబి దాడి కేసు చరిత్రను తిరగరాసింది. ఈ దాడిలో మక్కువ ట్రాన్స్‌కో ఎఇ పోలాకి శాంతారావు తప్పించుకొని శుక్రవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. దీంతో ఎసిబి అధికారులు అతన్ని అరెస్టు చేసి విశాఖపట్నం ఎసిబి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు పరిశీలించి ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో శాంతారావుకు బెయిల్ మంజూరైంది. దీంతో శనివారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విధుల్లో చేరి స్థానిక సిబ్బందితో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న వెంటనే మీడియా సంబంధిత కార్యాలయానికి వెళ్లనప్పటికీ ఎఇ శాంతారావు అందుబాటులో లేరు

ఫిర్యాదు దారుల్లో టెన్షన్.. టెన్షన్.

ఎఇ శాంతారావును ఎసిబికి పట్టించిన ఫిర్యాదారుల్లోను, వారికి సహకరించిన కొంతమంది ట్రాన్స్‌కో డిపార్టుమెంట్‌కు సంబంధించిన వారిలోనూ టెన్షన్ వాతావరణం నెలకొంది. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, ఒక కాంట్రాక్టర్ ఎఇని ట్రాప్ చేయించడం వరకు తెర వెనుక ఉండి తతంగం నడిపినట్లు చర్చ జరుగుతోంది.



విధుల్లో చేరిన ట్రాన్స్‌కో ఎఇ శాంతారావు

ఎసిబి అధికారులకు తలనొప్పి

ఈకేసు అవినీతి నిరోధక శాఖకు తలనొప్పిగా మారింది. ఎసిబికి పట్టుబడిన కేసు ఆదిలోనే బెడిసి కొట్టిన విధంగా మారిన తీరు చూస్తుంటే ఆ శాఖ పనితీరును ప్రశ్నించేలా మారిందని పలువురు విశ్లేషిస్తున్నారు.

టవర్లు, ఒఎఫ్‌సి కేబుళ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మొబైల్ టవర్ల నిర్మాణం, ఒఎఫ్‌సి కేబుళ్లు వేసేందుకు 16 అటవీ అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. సీతంపేట ఐటిడిఎ పరిధిలో మూడు బిఎస్ఎన్ఎల్, ఒక ఎయిర్‌టెల్ టవరు, ఒఎఫ్‌సి కేబుళ్లకు, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 2 ఎయిర్ టెల్, 8 బిఎస్ ఎన్ ఎల్ఒఎఫ్‌సి కేబుళ్లకు, రెండు జియో టవర్ల నిర్మాణానికి స్థలాలకు అనుమతులు మంజూరు చేశారు. రెవిన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, మంజూరుకు సిఫార్సులు చేసింది. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సామాజిక మార్పుకు, వైద్య అత్యవసర పరిస్థితులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక ప్రాముఖ్యత దృష్ట్యా వీటిని మంజూరు చేసినట్లు కమిటీ తీర్మానించింది. కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణు చరణ్, జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన, ఆర్ అండ్ బి ఇంజినీరింగు అధికారి ఎం.జేమ్స్, పార్వతీపురం ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, ఎయిర్ టెల్, బిఎస్ ఎన్ ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని కంబరకు సమీపంలో పులి సంచరించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారి రవికుమార్ సూచించారు. శనివారం గ్రామ సమీపంలో పులి పాదముద్రలను గుర్తించడంతో పులి సంచారంతో ప్రజలకు అవగాహన కల్పించారు.



కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో ట్రైనీ ఐఎఎస్‌లు, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

అంకితభావంతో విధులు నిర్వహించండి

ట్రైయినీ ఐఎఎస్‌లకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి - పార్వతీపురం

అంకిత భావంతో విధులు నిర్వహించి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలని, శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులు జిల్లాలో గత పది రోజులుగా అధ్యయన పర్యటనకు వచ్చి వివిధ ప్రాంతాలలో పర్యటించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సివిల్ సర్వీసెస్ అధికారులుగా వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేయడం జరుగుతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో భౌగోళిక స్థితిగతులు, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని, తదనుగుణంగా మంచి ప్రణాళికలు రూపకల్పన చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత పర్యటన గ్రామీణ ప్రాంతాలపై అవగాహనకు, ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహనా దోహదం చేస్తుందని అన్నారు. ప్రజలకు చేరువ కావడం అత్యావశ్యమని, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారించడంలో సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. యువ అధికారులుగా సమాజ సేవలో నిమగ్నం కావాలని, భవిష్యత్తులో మంచి అధికారులుగా రాణించాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వర్క్ షాప్

సీతంపేట : మండలంలోని పాత పనుకువలస సమీపాన గల వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం రైతులతో వర్క్ షాప్ నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి పి సీతారాం సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. చీడపీడలు యాజమాన్యం పద్ధతుల లోపాల గురించి అవగాహన కల్పించారు. అవసరమైన సస్య పోషణ, సస్యరక్షణ, మేలైన యాజమాన్యం పద్ధతుల గురించి తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సబ్ డివిజన్ శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, అమృతవీణ, ఉమా, జ్యోతి, రత్నకుమారి, వెంకటేశు, మధుసూదన్ రావు, పిఎఇఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ తిప్పలు ఎన్నాళ్లో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'వర్షం నిలకడగా కురవడం లేదు. కురిసినా నీరు నిలబడడం లేదు. అష్టకష్టాలతో ఒడిసిపట్టిన వర్షపునీటితో ఉబాలు పట్టి అతికష్టం మీద నాట్లు వేసినా నాట్లు వేసినా వాటిని బతికించుకునేందుకు నానా తంటాలు పడాల్సివస్తోంది.' ఇదీ జిల్లాలో మెజార్టీ ప్రజానీకం, ముఖ్యంగా రైతు కుటుంబాల నోట వినిపిస్తున్న మాట. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైనంత వర్షం కురిసినట్టుగా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అంత వర్షం కురవలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిసిన కాస్తంత వర్షాలకు తగ్గట్టు ఎండలు కూడా మండిపోతుండడంతో చెరువులు నిండలేదు. జలాశయాల్లోనూ సామర్థ్యానికి తగ్గట్టు నీరు లేదు. దీంతో, లక్ష్యానికి తగ్గట్టు వరి నాట్లు పడలేదు. జిల్లాలో సాధారణంగా జూన్ చివరి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. గత కొన్నాళ్ల నుంచి రుతుపవనాలు ఆలస్యం కావడంతో జులై ఒకటి లేదా రెండో వారంలోనైనా నారు పోతలు మొదలయ్యేవి. ఈ ఏడాది అందుకనుగుణంగా వర్షాలు కురవడంతో వరినారు పోతలు, ఇతర పంటల సాగు ఒకింత ఉత్సాహంగానే మొదలైంది. జులై చివరి వారం నుంచీ పెద్దగా వర్షాలు లేకపోవడంతో అనుకున్న స్థాయిలో నాట్లు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎదిగిన వరినారును ముందు పెట్టుకుని వరుణిడి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి. ఖరీఫ్ సీజన్‌లో 2,25,637 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,28,750 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. గత ఏడాది ఇదే సరిగ్గా సమయానికి 1,77,500 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. మొక్కజొన్న గత ఏడాది ఇదే సమయానికి సుమారు 30,500 ఎకరాల్లో సాగవ్వగా, ప్రస్తుతం 20,910 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి గతేడాది 5వేల ఎకరాలు సాగు కాగా, ప్రస్తుతం 3,127 ఎకరాలకు మించి సాగవ్వలేదు. చెరకు, వేరుశనగ, నువ్వులు, ఇతర అపరాలు తదితర పంటలన్నింటి సాగులోనూ ఇదే రకమైన వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో అన్ని పంటలు కలుపుకుని 3,17,052 ఎకరాల మేర సాగు విస్తీర్ణం కాగా, గత ఏడాది ఇదే సమయానికి 2,39,903 ఎకరాల్లో సాగు కనిపించింది. ఈ ఏడాది కేవం 1,85,755 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఈనేపథ్యంలో దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యాన్ని చాలా మంది రైతులు గుర్తుచేస్తున్నారు. వాస్తవానికి మన జిల్లాలో సాగునీటి వనరులకు కొదవలేదు. అందుకు తగ్గట్టే వర్షపాతం కూడా నమోదవుతోంది. అధికారిక లెక్కల ప్రకారం సాధారణ వర్షపాతం కన్నా 5 మిల్లీ మీటర్ల వర్షం అధికంగా కురిసింది. కానీ, ఈ నీరు చెరువులు, జలాశయాల్లోకి చేరేందుకు అనుగుణంగా కాలువలు లేవు. దీంతో, కొంతమేరకు వర్షపునీరు నదుల ద్వారా సముద్రం పాలవుతోంది. మరోవైపు ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోవడం వల్ల ఎండకు ఆవిరైపోతోంది. ఈ నేపథ్యంలో పాలకుల నిర్లక్ష్యం వల్లే ఏటా ఉబాలు ఆలస్యం అవుతున్నాయని, దీనివల్ల దిగుబడి కూడా సరిగా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

విద్యుత్తు భారాలపై మరో పోరాటానికి సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - సాలూరు

సామాన్య, మధ్యతరగతి ప్రజలు వినియోగించే విద్యుత్తు ఛార్జీలను అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెంచుతూ పోతుందని, ఇందుకు నిరసనగా ప్రజలంతా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని నాశనం చేస్తున్నాయని, తక్కువ రేటుకే వినియోగదారులకు, పేదలకు, కరెంటు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ సర్దుబాటు ఛార్జీల పేరుతో ఎప్పుడో వాడిన కరెంటుకు కూడా నేడు బిల్లులు కట్టిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. విద్యుత్ రంగాన్ని నాశనం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతుంటే, రాష్ట్రంలో వైసిపి మద్దతు పలుకుతూ వాటిని అమలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే స్మార్ట్ మీటర్లు', సర్దుబాటు చార్జీలు ,వ్యవసాయ పంపుసెట్లు తదితర విధానాలను తీసుకొస్తున్నారని, భవిష్యత్తులో వీటన్నింటిపై ప్రజలు పెద్ద ఎత్తున మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే సిపిఎం ప్రజలందర్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాలపై చైతన్య పరుస్తూ గడిచిన నాలుగు రోజులుగా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలంతా భారాలపై జరిగే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సాలూరు పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు, మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పట్టణ కమిటీ నాయకులు టి.రాముడు, లింగరాజు, శివ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. **పార్వతీపురం టౌన్ :** ఇఎల్ఆర్ పేరుతో విద్యుత్ కోతలు నిలిపివేయాలని, విద్యుత్ ఛార్జీలు, ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పట్టణ కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని 10,11 సచివాలయాల వద్ద నాయకులు గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సచివాలయం కార్యదర్శికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో భాస్కరరావు, రాజు, పండు, గౌరమ్మ, వెంకటమ్మ, జానకమ్మ, సింహాచలం, కుమారమ్మ, శాంతి పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం :** గిరిజనుల హక్కులు, చట్టాలు రక్షణకై ఐక్యంగా పోరాడాలని సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ పిలుపునిచ్చారు. మండలంలోని చాపరాయి బిన్నిడి, రాయగడ జమ్మూ, చెముడుగూడ సచివాలయాల వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నూతన చట్టాలను తీసుకువచ్చి అడవి నుంచి గిరిజన దూరం చేసే కుట్ర మోడీ సర్కార్ చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి గౌరయ్య, పి.మోహన్ రావు, పి.అసిరయ్య, ఎం.వెంకటరావు, ఎం .రమణ , బిజశంకర్రావు ఉన్నారు. **సీతానగరం** : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని చినబోగిలి, పెదబోగిలి గ్రామ సచివాలయాల వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలన్నారు. అనంతరం ఇఒ జి.వెంకట్రావుకు, పంచాయతీ కార్యదర్శి మనోహర్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పారావు,




పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



కొమరాడ : కూనేరు సంత వద్ద నిరన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మండలంలో స్థానిక సచివాలయంలో విద్యుత్‌ఛార్జీలు, నిత్యవసర ధరలు తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వై.మన్మధరావు, నాయకులు జగ్గారావు, ప్రకాశం, సాంబనాయుడు, నరసింహం పాల్గొన్నారు. **కొమరాడ :** మండలంలోని కూనేరు సంతలో ర్యాలీ అనంతరం సమావేశం ఏర్పాటు చేసి సచివాలయలు వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిరా, జిల్లాకమిటీ సభ్యులు కె.సాంబమూర్తి, నాయకులు పాల్గొన్నారు. **వీరఘట్టం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.ఎం తిరుపతిరావు ఆధ్వర్యంలో సంతకల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సంతకాలు సేకరణ చేసి మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావుకు అందజేశారు. ఆయనతో పాటు మండల నాయకులు ఎన్ సింహాచలం , రాము చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు .**పార్వతీపురం రూరల్ :** ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్పాలని సిపిఎం నాయకులు బంటుదాసు అన్నారు. సమరభేరీ కార్యక్రమంలో భాగంగా శనివారం డోకిశీల, తాళ్లబురిడి, బాలగొడబ, సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని సర్దుబాటు చార్జీలు విధించవద్దని డిమాండ్ చేశారు. పి.రాము, అనీల్ సంతు, శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పలుచోట్ల వైఎస్ వర్ధంతి

కీర్తిశేషులు వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల వైఎస్ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు.

పార్వతీపురం టౌన్ : వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ చేసి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, యిండుపూర్ గుణేశ్వరరావు, మూడు మండలాలు మరియు పట్టణ పార్టీ అధ్యక్షులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, ఎఎంసి ఉపాధ్యక్షులు భీమవరపు కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. **కురుపాం:** వైఎస్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక రావాడ జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహానికి ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటరావు, వైస్ ఎంపిపి అన్నాజీరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్,ఎంపీటీసీలు వి.బంగారు నాయుడు, స్వామియోజులు, సంతోషిని, మైనార్టీ విభాగం నాయకులు షేక్ నూరేళ్ల, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **సీతంపేట** : వెఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము, ఎఎంసి చైర్మన్ హిమరక మోహనరావు, వైస్ ఎంపిపి కె.సరస్వతి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు. **పాలకొండ:** స్థానిక కార్గిల్ జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రి సమీపంలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మున్సిపల్ చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, ఎంపీపీ బొమ్మాళి భాను, మండల కన్వీనర్ కణపాక సూర్య ప్రకాష్, పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధరావు, వైస్ ఛైర్మన్లు, వైస్ ఎంపిపిలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం** : వైఎస్ వర్ధంతి సందర్భంగా స్థానిక సిహెచ్‌సిలో ఎంపిపి కుంబిరిక దీనమయ్య రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. తొలుత స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణములో ఉన్న వెకెస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, జడ్పిటిసి రాధిక, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు. **పాలకొండ:** స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఆంధ్రప్రదేశ్ 108 ఎంప్లాయిస్ అసోసియేషన్ వైయస్సార్ టియుసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణం మీదుగా ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంఒ రవీంద్ర కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవి పాల్గొన్నారు. వీరితో పాటుగా 108 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, మన్యం జిల్లా అధ్యక్షులు గిరి గణపతి, సెక్రటరీ రవి బాబు, వైస్ ప్రెసిడెంట్ రాము, కాంబాబు, సంతోష్, శ్యామ్, సాయినాథ్, నాని బాబు, తేజ, రేరాజుతో పాటుగా ఉద్యోగులు వచ్చి స్వచ్చందంగా రక్తదానం చేశారు. **భామిని:** మండలంలోని కొరమ కూడలి వద్ద గల వైఎస్ విగ్రహానికి వైసిపి జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కొవ్వాడ చిరంజీవులు, మండలం కన్వీనర్ తోట సింహాచలం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జె సి ఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్ మజ్జి మోహన్ బాబు, కొత్తకోట ఆంజనేయులు, అగుతముడి రఘుపతిరావు, బొడ్డేపల్లి నాయుడు, సోమరాజు గోపాలరావు, బొడ్డేపల్లి ప్రసాద రావు, సర్పంచ్ లు, ఎం పి టి సి లు, వై సి పి కార్యకర్తలు పాల్గొన్నారు. **సాలూరురూరల్ :** మండలంలోని మామిడిపల్లి, బాగువలస, తోణాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, సాలూరు ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాసరావు, మాధవరావు, శశికళ, తోణాంలో సర్పంచ్ ముబ్వల ఆదయ్య పాల్గొన్నారు. **సీతానగరం:** మండలంలోని పెదబోగిలి జంక్షన్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, బి.శ్రీరాములు నాయుడు, పెదబాబులు, ఎంపిటిసి సభ్యులు స్వర్గాల గౌరీ, బి.కుసుమ ఆధ్వర్యంలో విగ్రహానికి ముందుగా పూలదండ వేసి నివాళులర్పించారు. అలాగే నిడగల్లు, బూర్జ, వెంకటాపురం, లచ్చయ్యపేట, గాజులవలసలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి బాబ్జి ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు. **బలిజిపేట :**మండలంలోని అరసాడలో టిడ్కో జమ్మాన ప్రసన్నకుమార్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి పిహెచ్‌సిలోని రోగులకు పండ్లు, అల్పాహారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, ఎంపిటిసి గుల్ల ప్రభావతి రాజు, బర్లీ ఎం పి టి సి శంకరరావు, సర్పంచ్ అప్పలనాయుడు, మిర్తివలస గంగయ్య, ఉప సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. **గరుగుబిల్లి :** వైఎస్ విగ్రహానికి ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనంజయరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బొబ్బిలి అప్పలనాయుడు, వైసిపి నాయకులు రౌతు రామినాయుడు, గులిపల్లి. శ్రీనివాసునాయుడు, తెర్లి ఎల్లంనాయుడు, నల్ల శ్రీరాములు నాయుడు, అక్కేన రామకష్ణ, కలిశెట్టి.చిననారాయనస్వామి, తదితరులు పాల్గొన్నారు. **వీరఘట్టం :** మండలంలోని తెట్టంగిలో పాలకొండ వ్యవసాయ మార్కెటింగ్ ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అలజంగి ఏలియా, దాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాలకొండలో వైఎస్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కొటియాపై పోరాటం ఆగదు

గిరిజన వర్సిటీపై మాట్లాడే హక్కు టిడిపికి లేదు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ఆంధ్రా ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాల పై తన పోరాటం ఆగదని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. శనివారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బోసు బొమ్మ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంక్షన్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వివాదాస్పద కొటియా గ్రామాల విషయంలో తన వైఖరిలో మార్పు లేదన్నారు. ఇటీవల గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు కేంద్ర విద్యా నైపుణ్యాభివద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారని చెప్పారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ కాబట్టి ఆయన్ను ఆహ్వానించామని చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో గిరిజన యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేదన్నారు. అందుకే టిడిపి గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు కేంద్రమంత్రిని పిలవలేదని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ పై మాట్లాడే హక్కు టిడిపికి లేదని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌లు జర్జాపు దీప్తి వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, కౌన్సిలర్ ఆర్.మాధవరావు, నాయకులు పి.అప్పలస్వామి, శివప్రసాద్, తాడ్డి శంకరరావు, పట్టణ మహిళా అధ్యక్షులు రాంబాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


కురుపాంలో కురుస్తున్న వర్షం

మన్యంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం కొనసాగి ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఆకాశం పూర్తిగా మేఘావృతమై భారీగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి కురుపాంతో పాటు గిరిజన గ్రామాలు తడిసిముద్దయ్యాయి. ఆగస్టు నెలాఖరు వరకు అంతంత మాత్రమే వర్షాలు కురవడంతో రైతులు వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆకాశం వైపు దిక్కులు చూస్తున్న తరుణంలో ఈ వర్షంతో ఉపశమనం కలిగింది. అలాగే వీరఘట్టం, సాలూరు, పాచిపెంట, మక్కువ తదితర మండలాల్లో వర్షం కురిసింది.

ఎస్‌విజివిబి మేనేజర్ శ్రీనివాసరావుకు సన్మానం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో తోటపల్లి దేవస్థానం ఆవరణలో విశాఖ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గంట శ్రీనివాసరావు సేవలకు గానూ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్న సందర్భంగా శనివారం దేవాదాయశాఖ ఛైర్మన్ మర్రాపు సత్యనారాయణ, డైరెక్టర్ పాత్రో, తోటపల్లి డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయనాయుడు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డి.పారినాయుడు సమయుక్తంగా సాలువా కప్పి, మెమెంటో ఇచ్చి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు తామద దుర్గారావు, మరుకొండ పకీర్ నాయుడు, శంబంగి సత్యనారాయణ, రొక్కం అప్పారావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

పేదల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పేదల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా? అని నియోజక ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయడమే మన ముందున్న కర్తవ్యమని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు క్లస్టర్ ఇంచార్జ్ జాడ శ్రీధర్, సర్పంచ్ కోట సంగంనాయుడు, వన్నాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలం కోసంగి జంక్షన్ నుండి అప్పారావు గూడ వరకు రోడ్ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేసి 8 నెలలు గడుస్తున్న నేటికీ పనులు ప్రారంభం చేయకపోవడం గిరిజనులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం కు నిలువెత్తు నిదర్శనం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు, మండల కార్యదర్శి ఏ. భాస్కర్ రావు విమర్శించారు. గడప గడప కు వెళు తున్న సందర్భంగా ప్రజలు నాయకులకు, అధికారులకు తమ సమస్య చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు వెంటనే దీనిపై తగు చర్యలు తీసుకొని రహదారి పూర్తి చేసి, గిరిజనులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలోని బెలగాంకు చెందిన పండిత రాము ఆర్టీసీ డిపోలో హెల్పర్‌గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం ఎమ్మెల్యే జోగారావు తన కార్యాలయంలో అందజేశారు. మరో రెండు మూడు వారాల్లో మిగతా రూ.90వేలు కూడా నేరుగా బాధిత కుటుంబ సభ్యుని అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఎఎంసి వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, వార్డు కౌన్సిలర్ సభ్యులు సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, సందీప్ కుమార్ తదితరులు వెంట పాల్గొన్నారు.

వాణి బాలకు సత్కారం

ప్రజాశక్తి - బలిజిపేట



వాణిబాలను సన్మానిస్తున్న సంజీవరావు

మండలం లోని పెదపెంకికి చెందిన కీర్తిశేషులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత కందికుప్ప అప్పలచార్యులు మాస్టారు కుమార్తె వాణీబాలను నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు దుస్సాలువ పూల బొకేతో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ పెదపెంకిలో పుట్టిన వాణీబాల విద్యారంగంలో పిహెచ్‌డి డాక్టరేట్ సాధించడం మన గ్రామానికే గర్వకారణమని తెలిపారు. విద్యా రంగంలో వాణీబాల ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ప్రస్తుతం వాణీబాల సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపి డాక్టర్ మచ్చ శ్రీనివాస్, కర్రి సతీష్, వాలంటీర్ కన్వీనర్ పెనుబోతు భాస్కర్, గొర్రెల శ్రావణ్, కోట గౌరీనాథ్, పరశురాం పాల్గొన్నారు.



పాఠశాలలో మలాథియన్ పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఆశ్రమ పాఠశాలలో ఎసిఎం పిచికారీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం కోలనీ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం ఎసిఎం 5 శాతం స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఎసిఎం 5 శాతం స్ప్రేయింగ్ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వర్షాకాలం దష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి పరిసరాల వద్ద, బోర్లు బావులు వద్ద స్ప్రేయింగ్ చేయించుకోవాలని కోరారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని దోమ కాటు నుంచి రక్షణకు ప్రతి ఒక్కరు దోమతెరలు వాడకం చేయాలని కోరారు.


రాజీమార్గమే గెలుపునకు సూచిక

ప్రజాశక్తి -భామిని



సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మౌలానా

సామాజిక రుగ్మతలు పోగొట్టేది విద్య అని, గిరిజనులంటే అమాయకులని కాదు, కల్మషం లేని వారని, లౌకిక, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగం ప్రకారం నడవడం చాలా గొప్ప విషయమని శ్రీకాకుళం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మండలంలోని నల్లరాయిగూడలో జిల్లా న్యాయ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వివాద రహిత, ఫిర్యాదు రహిత గ్రామం నల్లరాయిగూడ కావడంతో ఈ సదస్సును ఇక్కడ ఏర్పాటు చేశామని, జిల్లాకు మీ గ్రామం స్ఫూర్తి అని కొనియాడారు. ఒక కుటుంబంలోనే గొడవలు వుంటాయని, అలాంటిది మీ గ్రామంలో నేటి వరకు ఎటువంటి గొడవ లేకుండా ఉండడం గొప్ప విషయం అన్నారు. గ్రామంలో ఉన్నత విద్యావంతులు, సామాజిక నాగరికత తెలిసిన వారుండడం వల్ల ఇది సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్తులో మీ గ్రామం ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి, న్యాయ సంబంధ అంశాలపై సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా నల్లరాయిగూడ పూర్తి వివరాలను తహశీల్దార్ ఎన్.అప్పారావు వివరించారు. గ్రామస్థుడు గోమంగో తమ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామ స్థాయిలో సాధించిన విజయాలు, గ్రామం వివాదరహిత గ్రామంగా ఉండడానికి, పెద్దలపై నమ్మకం, గౌరవం కారణం అని తెలిపారు. పైప్ లైన్ ద్వారా సాగు నీటి సదుపాయం, రహదారి, రక్షిత మంచినీటి ప్లాంట్, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, గిరిజన ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేసి, దళారీ వ్యవస్థ అరికట్టాలని గిరిజన సంఘం నాయకులు కొండగొర్రి భాస్కరావు తెలిపారు. అనంతరం గ్రామస్తులు జిల్లా జడ్జి మరియు సబ్ కలెక్టర్ ను శాలువా తో సత్కరించారు. కార్యక్రమం లో సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు, కొత్తూరు సివిల్ జడ్జి ఎస్.మణి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పాలకొండ సిఐ మురళిదర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్‌వి శ్రీనివాసరావు, నల్లారాయిగూడ సర్పంచ్ బిద్దిక గౌయంతి, ఎంపిటిసి పాలక ఉషారాణి, ఎస్ఐ వై.అమ్మన్నారావు, ఎంపిడిఒ జి. చంద్రరావు, ఉపాధ్యాయులు బిడ్డికి రవి, గ్రామస్థులు వున్నారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘనాయకులు

కార్మికుల దీక్షలకు రిటైర్డ్ ఉద్యోగ సంఘాల మద్దతు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జీగిరాం జ్యూట్‌మిల్లు తెరవాలని కార్మిక జెఎసి చేపడుతున్న 12వ రోజు దీక్షలను బలపరుస్తూ విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం దీక్షా శిబిరానికి రిటైర్ ఉద్యోగుల సంఘం, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు బి.ధనుంజయరావు, డిజి ప్రసాదు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు మిల్లును తెరవకపోవడం వల్ల వందలాది కార్మిక కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమను కాపాడుకోలేని స్థితిలో ఈరోజు యాజమాన్యాలు, ప్రభుత్వం ఉందని విమర్శించారు. మిల్లును తెరిపించుకోవడానికి కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఉద్యోగులంతా అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ సింహాచలం, కె.శ్రీనివాసరావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

గుమ్మలో శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మలో పారిశుధ్య పనులను కొత్తగా ఎన్నికైన సర్పంచ్ ఆరిక గోపాల్ శనివారం చేపట్టారు. పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తనను ఆశీర్వదించి గెలిపించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పంచాయతీలో మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా పనిచేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వెంకటనాయుడు, సచివాలయ కన్వీనర్ పి. పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం, రోగులకు పండ్లు పంపిణీ తదితర సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో జనసేన నాయకులు అక్కివరపు మోహనరావు, వంగల దాలి నాయుడు, ఖాతా విశ్వేశ్వర రావు, చిట్లి గణేష్, గుంట్రెడ్డి గౌరీ శంకర్, బోనెల గోవిందమ్మ, లలిత, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, అల్లు రమేష్, సూర్య, కర్రి మణి, తదితరుల ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ మెయిన్ రోడ్డులో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నర్సిపురంలో కేకు కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సీతానగరం మీదుగా బలిజిపేట వరకు నియోజకవర్గం లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, అక్కేన భాస్కరరావు, అంబటి బలరాం, దుర్గాప్రసాద్, కేశవ, మహేష్, డి.కె.పట్నం, గోచెక్క, ఎమ్మార్ నగరం, మరికి, లిడికివలస, హిందూపురం, డికిశీల, నర్సిపురం తదితర గ్రామాలకు చెందిన జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద జనసేన నాయకులు గొర్లి చంటి, రాజాన రాంబాబు, మండల శరత్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ 500 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఆటో యూనియన్ సభ్యులు చిరు వ్యాపారులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందక అనిల్, రెడ్డి కరుణ, బంటు శిరీష్, నెయ్యి గాపుల సురేష్, మానేపల్లి ప్రవీణ్, కొల్లవరపు తేజ, లక్ష్మి, తెర్లి సంతోష్, వీరపిండి గణేష్, మీసాల సతీష్, షేక్ యాసిన్ బాబా తదితరులు పాల్గొన్నారు. **కురుపాం :** జనసేన నాయకులు నేరడబిల్లి వంశీ ఆధ్వర్యంలో జనసేన నాయకులు జియ్యమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్ బైక్ ర్యాలీగా చినమేరంగి 30 పడకల ఆసుపత్రి వద్దకు వెళ్లారు. అక్కడ రోగులకు, పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, రొట్టెలు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కురుపాం సాయిరాం గుడి వరకు ర్యాలీగా వచ్చి కురుపాం బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గంలో గల జన సైనికులు పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం :** పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు, అభిమానులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రోగుల ఇబ్బందులు తెలుసుకొని జనసేన కార్యకర్తలు తలో చేయి వేసి ఆరు ఫ్యాన్లు రోగుల సౌకర్యార్థం విరాళంగా అందించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం నుండి ఎల్విన్ పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కడ్రక మల్లేష్, నాయకులు అధికారి అనిల్, ధర్మ తేజ,కొనిస రాజా,కార్యకర్తలు పాల్గొన్నారు. **భామిని:** మండలంలోని బత్తిలిలో జనసేన మండల కన్వీనర్ రుంకు కిరణ్ కుమార్, మాజీ జెడ్‌పిటిసి నిమ్మల నిబ్రం ఆధ్వర్యంలో రక్త దాన శిబరం ఎర్పాటు చేసారు. ఈ శిబిరంలో 30 మంది జనసేన కార్యకర్తలు రక్తం దానం చేశారు. ఈ బ్లడ్ ను న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్లాంక్ వాళ్ళు సేకరించారు. కార్యక్రమంలో వికలాంగుడికి వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు వైకుంఠరావు, మహేష్, మిన్నరావు, కిరణ్ ఉన్నారు. **పాలకొండ రూరల్:** పట్టణంలో జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆఫీస్ నుంచి యాలం కూడలి వరకు బైకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 15 కేజీల కేక్ కటింగ్ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి నాగేశ్వరావు, నాలుగు మండలాల జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **మక్కువ :** మండలంలోని కె.పెద్దవలస పాఠశాలలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాతగైయిలలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.రిషివర్ధన్, ఎస్.బంగారురాజు పలువురు జనసేన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. **వీరఘట్టం :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నడుకూరు, బొడ్లపాడు, తలవరం, వీరఘట్టం గ్రామాలలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం. పుండరీకం, కె.సాయిపవన్, వజ్రగడ జనసేన, కోడి వెంకటరావు నాయుడు, ఎం.భరత్ తదితరులు పాల్గొన్నారు.


భామినిలో రక్తదాన శిబిరం చేస్తున్న జనసేన కార్యకర్తలు


పార్వతీపురంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తునన జనసేన నాయకులు

గారమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని గారమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాలకొండలో సిపిఎం మండల కన్వీనర్ డి. రమణారావు, కాద రాముతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకొండ నగర పంచాయతీ ప్రజల నుండి భారీగా పన్నులు వసూలు చేసే శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం వైఫల్యం చెందిందన్నారు. పట్టణంతో పాటు శివారు ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, పోతులగెడ్డ కాలువకు ఆనుకుని ఉన్న గారమ్మ కాలనీ ప్రహరీ గోడ నిర్మించాలని, రహదారి సౌకర్యాలు కల్పించాలని, మురికి కాలువలు, రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టాలని, కమ్యూనిటీ స్థలం ప్రజలు వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించాలని, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకవర్గం దృష్టి సారించాలని, లేకుంటే ప్రజల్ని సమీకరించి ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

ఆదిత్య ఎల్-1 ప్రయోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆదిత్య ఎల్1 శనివారం ఉదయం నిర్వహించిన ప్రయోగాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో విద్యార్థులకు ఉపాధ్యాయులు లైవ్ చూపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మురళీధర్ ఇస్రో ఎవర్ గ్రీన్ విక్టరీ అన్నారు. ఇస్రో ప్రయోగాల సాధనలో ప్రపంచంలోనే ముందంజలో ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇస్రో ప్రయోగాలపై అవగాహన పెంచుకొని రేపటి తరానికి శాస్త్రవేత్తలు అవుతారని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.


రెబ్బ గ్రామానికి నదిని దాటుకొని వెళ్తున్న వైద్యాధికారి, సిబ్బంది

రెబ్బను సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని నాగావళినది ఆవల గల మారుమూల గ్రామం రెబ్బ గ్రామాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య బృందంతో కలిసి శనివారం సందర్శించారు. ఉధృతంగా ప్రవహి స్తున్న నది దాటుకొని వైద్యాధికారి, సిబ్బంది గ్రామానికి వెళ్లి అక్కడ చిన్నారులకు, గర్భిణీలకు వైద్య సిబ్బంది వ్యాధినిరోధక టీకా వేయడాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో గర్భిణీలు ఎంతమంది, ఐదేళ్లలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారిలో నవజాత శిశువుల వివరాలు, వారి ఆరోగ్య స్థితి, వ్యాక్సినేషన్, గ్రామంలో జ్వరాలతో ఎవరైనా ఉన్నారా తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు.జ్వర లక్షణాలున్న ఇద్దరికీ వైద్య సిబ్బంది నిర్ధారణ పరీక్షలు చేసి,అవసరమైన మందులు అందజేయడం జరిగిందన్నారు. ఇతర రుగ్మతలు వున్న వారితో మాట్లాడి వారి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు అక్కడ స్థానికులతో మాట్లాడారు. వారి తెలిపిన సందేహాలకు తగు సూచనలు చేస్తూ, ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించి, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో అవసరమైన మందులు, పరీక్షల లభ్యతను పరిశీలించారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలున్నా వెంటనే స్పందించి తగు చికిత్స అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల బరువులను పరిశీలించారు. కార్యక్రమంలో కెఆర్‌బి పురం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ బి.శామ్యూల్‌జాన్, సూపర్ వైజర్స్ జయగౌడ్, బద్రినారాయణ రావు, ఎఎన్ఎంలు ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గ్రోమోర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న గ్రోమోర్‌పై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు నిమిత్తం షాప్‌కు వెళ్తే ఒక ఎరువు కుంటే వేరేది తీసుకువెళ్లాలని అంటగడుతున్నారన్నారు. అంతేకాకుండా ఉన్న ఎరువులు బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందజేస్తామని చెబుతున్న అధికారులు ఎక్కడా సక్రంగా రైతులకు ఎరువులు అందడం లేదని అన్నారు. తక్షణమే జిల్లా, మండల స్థాయి అధికారులు కలగజేసుకుని గ్రోమోర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిచో రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి భాగ్యరాధ, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని లుంబూరు గ్రామ పంచాయతీలో జగనన్న పింఛన్ల కానుక పథకంలో భాగంగా 25 కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగింది. వీటిని శనివారం ఆ గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ చేతుల మీదగా నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రౌతు వాసుదేవ రావు, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి మాధురి, డిజిటల్ అసిస్టెంట్ జగదీష్, వాలంటీర్స్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

మున్సిపాలిటీలో వివిధ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షక ఇంజనీర్ ప్రజారోగ్య సాంకేతిక శాఖ (ఎఫ్ఎసి) పి.గణపతిరావు సంకిలి హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలించారు. అనంతరం అర్బన్ హెల్త్ క్లినిక్, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయవలసినదిగా సమీక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఎఐఐబి నిధులతో చేపడుతున్న మంచినీటి సరఫరా పథకాల పనులు త్వరితగతిన పూర్తిచేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈయనతో పాటు డిపిహెచ్ ఇఇ నరసింగరావు, టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణికుమార్, సహాయక ఇంజనీర్ కె.కిరణ్ కుమార్, వార్డ్ ఏమినిటీ సెక్రటరీలు దేవి వరప్రసాద్, స్వాతిలు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాకేటి రాంబాబుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో శనివారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, మరింత విద్యా బోధనపై దృష్టి పెట్టాలని రాంబాబు మాస్టారుకు సూచించారు.టిడిపి మండల యువత అధ్యక్షులు మాచర్ల అనిల్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన రాంబాబుకు అభినందనలు తెలిపారు.


పింఛనుదార్ల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

కొత్త పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్వి ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన దాన్ని పెన్షన్ మంజూరైన వ్యక్తిని ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ పెన్షన్ వెరిఫికేషన్ అనంతరం ప్రభుత్వం మంజూరు చేసినవి ప్రజా ప్రతినిధుల ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లోనూ కార్యదర్శులు, వెల్ఫేర్ అస్టెంట్ల ద్వారా వెరిఫికేషన్ అనంతరం అర్హులను గుర్తించి వారందరికీ పింఛన్లు అందజేస్తామని తెలిపారు.


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలోని 6,7 వార్డుల పరిధిలో గల నవిరి కాలనీ, కొత్తవలస శివారులో ఉన్న వై జంక్షన్‌ను ఆనుకొని పలువురు వ్యక్తులు ఆక్రమణలు చేస్తుండడంతో సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు టౌన్ ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి ఆక్రమణలు జరిగిన ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో అనధికారంగా శాశ్వత కట్టడాలను నిర్మించడంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వై జంక్షన్ ప్రాంతంలో ప్రతి రోజూ వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయని అలాంటి సమయాల్లో ఈ ఆక్రమణల వల్ల వాహన ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుందని, భవిష్యత్తులో అలాంటి సంఘటన జరగకుండా ఉండేందుకు ఈ ఆక్రమణలు తొలగిస్తున్నామని తెలిపారు. అంతేగాని ఎవరిపై ఎలాంటి కక్ష సాధింపు చర్య కాదని అన్నారు.

12,13 తేదీల్లో అఖిలభారత ఆదివాసీ సదస్సు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అడవిని, అటవీ సంపదను కార్పోరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర పాలకులు చేసిన చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ఆదివాసీ సదస్సు ఈనెల 12,13 తేదీల్లో జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన గిరిజన జీవవైవిద్యం నష్టం కలిగించే చట్టాలను రద్దు చేయాలని కోరుతూ విశాఖలో ఈ సదస్సు సదస్సుకు పశ్చిమబెంగాల్ ఆదివాసీ ఉద్యమ నేత, నక్సల్ బరి పోరాట నాయకులు శాంతి ముండ, ఎఐకెఎంకెఎస్ జాతీయ కన్వీనర్ సుబోధ్ మిత్రా, కో కన్వీనర్ సింహాద్రి ఝాన్సీ, పది రాష్ట్రాల ఆదివాసీ, రైతు కూలీ ఉద్యమ నేతలు హాజరవుతారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, జిల్లా సహాయ కార్యదర్శి పి.శ్రీనునాయుడు, కోశాధికారి మర్రి చెంచు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని మోసూరుకు చెందిన అలజంగి ఈశ్వరరావు (31) మనస్థాపానికి గురై తన నివాసంలో శనివారం వేకుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్సై ఫక్రుద్దీన్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోసూరుకు చెందిన అలజంగి ఈశ్వరరావు గ్రామంలో పాలు, ఫ్యాన్సీ వస్తువుల వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాడు. సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తికాక దిగులుతో మద్యానికి బానిసై అప్పుల పాలయ్యామనే మనస్థాపనతో తన నివాసంలో శనివారం వేకువ జామున ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు